క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

నెల్లిమర్ల రూరల్: పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాలార్చన, బాలభోగం చేసిన తర్వాత యాగశాలలో సుందరకాండ హవనం, శ్రీమద్రామాయణ పారాయణం చేశారు. అనంతరం స్వామి వారికి పంచామృతాభిషేకం చేపట్టారు.

పక్కాగా డ్రైడే పాటించాలి



తాగునీటి బోరుకు ఉన్న టైరులో నిల్వ నీరు తొలగిస్తున్న ఆరోగ్య సిబ్బంది

విజయనగరం: ప్రతి శుక్రవారం పక్కాగా డ్రైడే పాటించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ కార్యదర్శులు, ఏఎన్ఎంలు నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించి, పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనవసర నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. మురుగునీరు ఎక్కువగా ఉన్నచోట దోమలు అధికంగా పెరిగే అవకాశం ఉందని తద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే వాటిని నిర్మూలించాలని, దీనికోసం యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టడం జరుగుతోందన్నారు.

కార్మికులకు అండగా సీఐటీయూ



కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, టోల్‌ప్లాజా సిబ్బంది

డెంకాడ: కార్మికులకు అండగా సీఐటీయూ నిలుస్తోందని, కార్మికుల సంక్షేమం, భద్రత కోసం ఎన్నో పోరాటాలు చేసిందని ఆ సంఘ నాయకుడు సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని నాతవలస టోల్‌ప్లాజా వద్ద సీఐటీయూ 55వ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన ఆ సంఘ నాయకులు మరికొంతమందితో కలిసి సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. 1970లో ఏర్పాటైన సీఐటీయూ కార్మికుల పక్షాన నిలబడి అనతికాలంలోనే మంచి గుర్తింపు పొందిందన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉండాలని, అలా ఉంటేనే హక్కుల సాధన సాధ్యమన్నారు. కార్యక్రమంలో వి.కృష్ణ, వై.ఆదినారాయణ, ఎ.సురేష్, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 5న మొక్కలు నాటే కార్యక్రమం

విజయనగరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని, జూన్ 5వ తేదీన మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం మొక్కలు నాటేందుకు అవసరమైన గోతులను కూలీలతో తవ్వించడం జరుగుతోందని, ఆ పనులను డీఈలు, ఏఈలు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. మొత్తం 5 వేలకు పైగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్వమానవాళి మనుగడకు మొక్కలే ఆధారమని, ప్రతిఒక్కరూ మొక్కలు పెంచి, వాటిని సంరక్షించాలని కోరారు.

ఇంకెన్నాళ్లీ అవస్థలు!

నియోజకవర్గంలో మొత్తం పాఠశాలల సంఖ్య:	ఉన్నత పాఠశాలల సంఖ్య:	ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య:	ప్రాథమిక పాఠశాలల సంఖ్య:	ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య:	నాడు-నేడు రెండు దశల్లో ఎంపిక చేసిన పాఠశాలల సంఖ్య:	మొదటి దశలో ఎంపిక చేసిన పాఠశాలల సంఖ్య:	రెండో దశలో ఎంపిక చేసిన పాఠశాలల సంఖ్య:
123	16	9	98	15,724	93	43	50



విజయనగరం: అసంపూర్తిగా దాసన్నపేట బాలికోన్నత పాఠశాల

- ప్రభుత్వ విద్యపై కూటమి నిర్లక్ష్యం
- ముందుకు కదలని నాడు-నేడు పనులు
- అసంపూర్తిగా నిర్మాణాలు
- విద్యార్థులకు తప్పని కష్టాలు

విజయనగరం: ఈ చిత్రంలో అసంపూర్తిగా కనిపిస్తోందీ.. విజయనగరంలోని దాసన్నపేట బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనం. ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి వరకు 875 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సరిపడ భవనం ఉండేలా గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం నిధులు ఉన్నా భవనం పూర్తికి చంద్రబాబు సర్కారు చర్యలు తీసుకోవడం లేదు. జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం కావస్తున్నా ఇంకా భవనం పూర్తికాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇంకెన్నాళ్లు తమ బిడ్డలకు కష్టాలని ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితి ఈ ఒక్క పాఠశాలలోనే కాదు.. నియోజకవర్గంలో గతంలో నాడు-నేడు ఫేజ్ 2 దశలో అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసిన పాఠశాలలన్నింట్లోనూ నెలకొనడం గమనార్హం.

రూ.21.96 కోట్లు విడుదల..

విజయనగరం నియోజకవర్గంలో నాడు-నేడు కార్యక్రమం మొదటి దశలో 43 పాఠశాలల అభివృద్ధి పనులను రూ.11.74 కోట్లతో పూర్తి చేశారు. రెండో దశలో మరో 50 పాఠశాలలను అభివృద్ధి బాట పట్టించేందుకు ఎంపిక చేసి, రూ.21.96 కోట్ల నిధులు కేటాయించారు. అయితే ఇప్పటికీ ఆయనా నిర్మాణాలు పూర్తి దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వం కేటాయించిన నిధులను మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండగా నిర్మాణాల పూర్తిలో తీవ్ర జాప్యం కనిపిస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎక్కడా ప్రగతి పనులు కానరాకపోవడంతో ఈ ఏడాది విద్యార్థులకు కష్టాలు తప్పేలా లేవు. పాఠశాలల పునఃప్రారంభం నాటికైనా కనీసం నిర్మాణాలు పూర్తి చేస్తారా అని చూస్తే ఎక్కడా ఆ దిశగా పనులు జరగకపోవడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. తామొస్తే అభివృద్ధి అని చెప్పారు..ఇదే నా అభివృద్ధి అని నిలదీస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో చకచకా..

మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ప్రభుత్వ విద్యపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మార్పు చేయాలనే సంకల్పంతో నాడు-నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన, అదనపు తరగతి గదుల నిర్మాణం వంటి వాటికి చర్యలు చేపట్టారు. వాటిలో కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఏడాది క్రితం పాలన పగ్గాలు చేపట్టిన కూటమి సర్కారు ఆ పనులు పూర్తి చేయలేదు. దీంతో ఈ ఏడాది కూడా విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొనడంతో ప్రభుత్వం తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయలేకపోయారా అని ప్రశ్నిస్తున్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి..

నాడు-నేడు పథకంలో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. ఏడాది కాలంగా పనులు చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దాసన్నపేట బాలికల ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల కోసం చేపట్టిన భవనంలో పూర్తి స్థాయిలో సదుపాయాలు లేవు. విద్యార్థులంతా ఉన్న ఇరుకైన గదుల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా నిర్మాణాల పూర్తికి చొరవతీసుకోవాలి.

-ఎల్.వెంకటేశ్వరరావు, విద్యార్థి తండ్రి, విజయనగరం

నాడు కళకళ.. నేడు వెలవెల..



పూసపాటిరేగ: నిలిచిన పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం

పూసపాటిరేగ: ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి..నాడు కళకళ.. నేడు వెలవెల.. అనే మాదిరిగా కనిపిస్తోంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తూ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిచ్చారు. ఆ దిశగా నాడు-నేడు కార్యక్రమం ప్రారంభించి, పాఠశాలల ఆధునీకరణ, అదనపు తరగతి గదుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. వాటిలో మొదటి విడత నాడు-నేడు పనులు దాదాపు పూర్తి కాగా, రెండో విడత పనులు పూర్తి కాలేదు. దీనికి కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంపిక చేసిన ఏ పాఠశాలలోనూ కూటమి సర్కారు అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకురావడం లేదు. త్వరలో పాఠశాలల పునఃప్రారంభం కావస్తున్నా నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలి ఉండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంకెన్నాళ్లీ అవస్థలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో రూ.36 కోట్లతో..

గతంలో వైఎస్సార్ సీపీ హయాంలో నెల్లిమర్ల నియోజకవర్గంలో రూ.36 కోట్ల వ్యయంతో పాఠశాలల తరగతి గదులు, పాఠశాలలకు కావాల్సిన అదనపు హంగులకు శ్రీకారం చుట్టారు. నిధులు కూడా మంజూరు చేయడంతో పనులు చకచకా జరిగాయి. సరిగా ఏడాది క్రితం నుంచి ప్రస్తుత కూటమి హయాంలో పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఎక్కడికక్కడ నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

అసంపూర్తిగా నిర్మాణాలు..

డెంకాడ మండలంలో 10 కాంపోనెంట్స్, అదనపు తరగతి గదులు కలిపి 37 పాఠశాలలకు రూ.9.19 కోట్లు మంజూరు కాగా ఇప్పటివరకు కేవలం రూ.3.83 కోట్లు పనులు మాత్రమే జరిగాయి. మిగతా భవన నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి. నెల్లిమర్ల మండలంలో 10 కాంపోనెంట్స్, 49 పాఠశాలలకు అదనపు తరగతి గదులు మంజూరు కాగా వాటి పనులకు రూ.9.10 కోట్లు మంజూరవ్వగా రూ.5.56 కోట్ల పనులు మాత్రమే జరిగాయి. భోగాపురం మండలంలో 10 కాంపోనెంట్స్ , 25 పాఠశాలలకు 6.5 కోట్లు మంజూరవ్వగా నేటి వరకు కేవలం 3 కోట్ల పనులు మాత్రమే జరిగాయి. పూసపాటిరేగ మండలంలో 10 కాంపోనెంట్స్‌కు 41 పాఠశాలలకు గాను రూ.11 కోట్లు కేటాయించగా కేవలం 4.5 కోట్ల నిధులు మంజూరవ్వడంతో పాఠశాల భవనాలు మధ్యలోనే నిలిచిపోయాయి.

పనులు నిలిచిపోయాయి..

ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాల పూర్తి పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి పనులు ముందుకు కదల్లేదు. ఇప్పటికైనా నిలిచిన పనులు పునఃప్రారంభించి, త్వరగా పూర్తి చేయాలి

-ఎస్.పుష్ప, విద్యార్థిని తల్లి, పూసపాటిరేగ

విద్యకు తొలి ప్రాధాన్యమివ్వాలి..

కూటమి సర్కారు కూడా విద్యకు తొలి ప్రాధాన్యమివ్వాలి. ఏడాదిగా నిధులు లేక పాఠశాలల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. తక్షణమే ప్రభుత్వ పెద్దలు స్పందించి, నిర్మాణాలు పూర్తికి నిధులు మంజూరు చేయాలి.

-బి.వెంకటపోతన్న, పూసపాటిరేగ

పేదోళ్లకు అండగా నిలిచింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: పేదోళ్లకు అండగా నిలిచింది...గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడాన్ని నిరసిస్తూ జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినం కార్యక్రమ నిర్వహణకు పార్టీ అధిష్ఠానం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఈ సమావేశం జరగ్గా పార్టీ శ్రేణులను మాజీ ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. అమలు సాధ్యంకాని హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఏ ఒక్క పథకమూ పూర్తిస్థాయిలో అమలుచేయకుండా ప్రజలను నిలువుగా మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. కేవలం సీఎం చంద్రబాబు సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకే అమరావతిని రాజధానిగా ఎంచుకున్నారని, ఇప్పుడు అక్కడి పొలాల్లో గట్లుపై వేసిన రోడ్లు వర్షానికి పాడవుతున్నాయన్నారు. అభివృద్ధిలో వెనకబడిన ఉత్తరాంధ్రలో విశాఖ రాజధాని అవుతుందంటే అప్పట్లో ఆదరణ కరువైందన్నారు. సూపర్ సిక్స్ హామీలను నమ్మి ఓటేసిన జనానికి చంద్రబాబు సర్కారు నిలువునా ముంచిందన్నారు. ఏ ఒక్క పథకమూ అమలుకాకపోవడంతో ప్రజలంతా సంక్షేమానికి దూరమయ్యారన్నారు. పార్టీలో కూడా కొంతమంది వెన్నుపోటు పొడిచి పార్టీని వీడి వెళ్తున్నారని, అటువంటి వారికి భవిష్యత్ ఉండదన్నారు. అత్యంత ప్రజాదరణ కలిగిన పార్టీ వైఎస్సార్ సీపీ అని, పార్టీ నుంచి ఎవరు వెళ్లినా పార్టీ నష్టమేమీ లేదన్నారు. రాష్ట్రంలో పార్టీకి 40 శాతం ఓటింగ్ ఉందన్న విషయం మర్చిపోకూడదన్నారు. రాబోయే స్థానిక సంస్థల్లో విజయదుందుభి మోగించడం ఖాయమన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల మండలాల అధ్యక్షులు పి.అప్పలనాయుడు, యు. సూర్యనారాయణరెడ్డి, పి.తమ్మునాయుడు, జి.సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు ఎ. సత్యనారాయణమూర్తి, ఎస్.సత్యనారాయణరాజు, టి.సీతారాం, ఎస్. వైకుంఠం, పి. సత్యనారాయణ, ఎం.జనార్ధనరావు, ఎం.శ్రీనివాసరావు, డి.త్రినాథరావు, పి.భాను ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత



యోగా చేస్తున్న అధికారులు, తదితరులు

విజయనగరం: యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరంలోని ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచి సెంటర్, గాంధీ విగ్రహం వద్ద యోగా సాధన శుక్రవారం చేశారు. అనంతరం వెంకటలక్ష్మి జంక్షన్ వద్ద ర్యాలీ ప్రారంభించి, ప్రధాన రోడ్డు మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు, యోగా గురువులు పాల్గొని, యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరి బాబు, మెప్మా సిబ్బంది, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన



సీఐటీయూ జెండా ఎగురవేస్తున్న సంఘ నాయకులు

విజయనగరం గంటస్తంభం: ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి, ప్రధాన కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, కె.సురేష్ అన్నారు. స్థానిక ఎస్పీఆర్ శ్రామిక భవన్, ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సీఐటీయూ(సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్) ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1970లో ఏర్పడిన నాటి నుంచి నేటివరకు అనేక నిర్బంధాలు ఎదుర్కొని కార్మిక వర్గ ఐక్యత కోసం, పెట్టుబడిదారీ విధానాన్ని, శ్రమదోపిడీని, అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ దేశ ఐక్యత, సమగ్రత, ప్రభుత్వ రంగ పరిరక్షణ, కార్మిక, ఉద్యోగ హక్కుల కోసం నిరతరంగా పోరాడుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 19 జాతీయ సమ్మెలు నిర్వహించడంలో సీఐటీయూ కీలకపాత్ర వహించిందన్నారు. రైతాంగ, వ్యవసాయ కూలీల పోరాటాలకు సంఘీభావంగా నిలిచిందన్నారు. జూలై 9వ తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తామన్నారు. అంతకుముందు సీఐటీయూ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శులు రవి కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటరావు

విజయనగరం టౌన్: ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గదుల వెంకటరావు ఎన్నికయ్యారు. మంగళగిరిలోని ఆ సంఘ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఎన్నిక ప్రక్రియలో ఆయన ఎన్నిక ఖరారు కాగా ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఆయన నియామకం పట్ల పలువురు బీసీ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తక్షణమే ఎండీఎం బిల్లులు చెల్లించాలి



బిల్లులు చెల్లించకపోతే మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) వంటకాలు ఎలా చేయాలని వంట నిర్వాహకులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. త్వరితగతిన బిల్లులు చెల్లించాలని కోరారు. ఇదే విషయమై పలువురు వంట నిర్వాహకులు సీఐటీయూ ఆధ్వర్యంలో విజయనగరంలో డీఈవో మాణిక్యంనాయుడును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజనం మెనూకు సంబంధించి, మార్చి, ఏప్రిల్ నెలల బిల్లుల చెల్లింపులు జరగలేదని తెలిపారు. అలాగే తమకు, పాఠశాలల ఆయాలు, వాచ్‌మన్‌లకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల జీతాలు ఇంతవరకు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయని, ఇప్పటికీ జీతాలు, బిల్లులు చెల్లించకుంటే ఎలా బతకాలని నిలదీశారు. 2024 అక్టోబరులో పెంచామని చెప్పిన మెనూ చార్జీల బిల్లులు నేటికీ జనరేట్ కాలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, వంటపాత్రలు, యూనిఫాం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు, రాజేశ్వరి, ధనలక్ష్మి, లక్ష్మి, సింహాచలం, సరస్వతి, మంగ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

-విజయనగరం గంటస్తంభం

పేరుకుపోయిన అపారిశుధ్యం



ఈ చిత్రంలో చూస్తోంది.. విజయనగరం రాజీవ్‌నగర్ కాలనీకి వెళ్లే దారిలోని తాగునీటి బోరు. పశుపోషకులు ఇక్కడే పశువులను కట్టేస్తుండడంతో వాటి వ్యర్థాలతో బోరు వద్ద అపారిశుధ్యం ఇలా పేరుకుపోయింది. దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కూడా మౌనంగా ఉండడంతో అదే పరిస్థితి కొనసాగుతోంది. బోరు పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో బోరు నీరు వాడేందుకు ఎవరూ ఆసక్తి చూపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-విజయనగరం